క్లుప్తంగా

గంగమ్మ ఆలయంలో విశేష పూజలు


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

భాకరాపేట : జంగావాండ్లపల్లె పంచాయతీ చినిగేపల్లెలోని కట్టమీద గంగమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా హోమాలు, సకల దేవతలకు విశేష పూజలు నిర్వహించారు. మంగళవారం వేకువ జాము నుంచి అమ్మవారి ఆలయంలో గణపతి పూజ, కలశస్థాపన, ప్రధాన దేవతల ఆవాహన, అగ్ని ప్రతిష్ట, గణపతి హోమం, రుద్ర హోమం, నవగ్రహ హోమం, దుర్గా హోమం, లఘు పూర్ణాహుతి, తీర్థ ప్రసాద వినియోగం, జలాధివాసం, క్షీరాధివాసం జరిపించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సహదేవరెడ్డి, నాగలక్ష్మి, సర్పంచ్ సింహాల విమల పాల్గొన్నారు.

'చాగంటి' సేవలు అవసరం

తిరుపతి ఎడ్యుకేషన్ : విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించి, సంస్కృతి సంప్రదాయాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వ సలహారుగా చాగంటి కోటేశ్వరరావు సేవలు అవసరమని అపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ చాగంటి నియామకంపై కొందరు విమర్శలు గుప్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల మనోవికాసానికి చాగంటి ప్రవచనాలు ఉపయోగపడతాయని వెల్లడించారు.

సస్యరక్షణపై అవగాహన


మాట్లాడుతున్న ఏడీఏ లక్ష్మీదేవి

రామచంద్రాపురం : మండలంలోని సి.రామాపురం, బలిజపల్లిలో మంగళవారం వరి, వేరుశనగలో సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ లక్ష్మీదేవి మాట్లాడుతూ యాజమాన్య పద్ధతులను వివరించారు. ఉద్యానశాఖ అధికారి సునీల్ మాట్లాడుతూ మామిడి రైతులందరూ పంట బీమా చేయించుకోవాలని సూచించారు. ఎకరాకు రూ. 1,750 ప్రీమియం చెల్లించాలని చెప్పారు. 3ఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ రీజనల్ కో–ఆర్డినేటర్ విజయ్ ప్రసాద్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ మొక్కలను 100 శాతం సబ్సిడీతో అందిస్తున్నామని, పంట సాగు నుంచి మార్కెటింగ్ వరకు సాయం చేస్తామని వెల్లడించారు. వ్యవసాయాధికారి స్రవంతి మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని కోరారు.

పంచాయతీలకు ట్రాక్టర్లు


ట్రాక్టర్లకు పూజ చేస్తున్న ఎమ్మెల్యే నాని

రామచంద్రాపురం: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మంగళవారం నెత్తకుప్పం, కుప్పంబాదూరు, రామాపురం, దేశూరికండ్రిగ పంచాయతీలకు స్వచ్ఛభారత్ కింద మంజూరైన ట్రాక్టర్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ పంచాయతీల్లో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ట్రాక్టర్లను వినియోగించుకోవాలని సూచించారు.

సాయినాథునికి ప్రత్యేక పూజలు


అన్నదానం చేస్తున్న సేవా సమాజ్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : కొంకా వీధిలోని శ్రీసాయిబాబా మందిరం 23వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం సుమారు 3 వేల మంది భక్తులకు అన్నదానం చేశారు. అలాగే 2025 నూతన క్యాలెండర్ ఆవిష్కరించారు. రాత్రి 7 గంటలకు బాబా చిత్రపటం ఊరేగింపు చేపట్టారు. కార్యక్రమంలో షిరిడీ సాయిబాబా సేవా సమాజ్ ప్రతినిధులు మబ్బు దేవనారాయణరెడ్డి, కుడితి సుబ్రమణ్యం, దుర్గం శ్రీనివాస్, మర్దం శివ, సి.రమేష్, పి.విజయలక్ష్మి, శ్రీను, హరిబాబు, ప్రభాకర్, బాలకృష్ణ, కళావతి, రాణి పాల్గొన్నారు.

గంగమ్మ గుడికి విరాళం


ఈఓకు నగదు అందిస్తున్న దాతలు

తిరుపతి కల్చరల్ : తాతయ్యగుంట గంగమ్మ ఆలయానికి నగరానికి చెందిన నాగతం, చిరంజీవిరెడ్డి, నేత్రజ్ఞ పుల్లారెడ్డి మంగళవారం రూ.1,01,116లు విరాళంగా అందజేశారు. దాతలకు ఆలయ ఈఓ జయకుమార్ ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

అభినందన

మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా ఇటీవల ఎస్వీయూ ఆధ్వర్యంలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రీపద్మావతీ మహిళా జూనియర్ కళాశాల, ఎస్వీ జూనియర్ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచి విజేతలుగా నిలిచారు. మంగళవారం ఈ మేరకు వారిని ఆయా కళాశాలల్లో ప్రిన్సిపాళ్లు భువనేశ్వరి, ప్రకాష్‌బాబు, అధ్యాపకులు అభినందించారు.
– తిరుపతి ఎడ్యుకేషన్


విద్యార్థులతో ప్రిన్సిపల్ ప్రకాష్‌బాబు


విద్యార్థినులతో ప్రిన్సిపల్ భువనేశ్వరి

ఆవేదన

అధికారుల నిర్లక్ష్యంతో ఉన్నత ఆశయం నీరుగారిపోతోంది. పట్టించుకునేవారు లేక ప్రజాధనం వృథాగా మారుతోంది. దివ్యాంగుల కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.78లక్షలు వెచ్చించి 65 ట్రై స్కూటర్లు మంజూరు చేసింది. అర్హులందరికీ అందించాలని ఆదేశించింది. ఈ మేరకు అప్పట్లోనే 64 మందికి వాహనాలను పంపిణీ చేసింది. చంద్రగిరికి చెందిన ఓ విభిన్నప్రతిభావంతుడు మృతి చెందడంతో ఓ స్కూటర్ మాత్రం కలెక్టరేట్‌లోనే మిగిలిపోయింది. ఇక అప్పటి నుంచి ఆ వాహనం సంగతిని అధికారులు పక్కన పెట్టేశారు. తమకు అప్పగించాలని వినతులు సమర్పించినా స్పందన లేదని పలువురు దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విభిన్నప్రతిభావంతుల సంక్షేమ సంచాలకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హుడిని గుర్తించి అందించేందుక ప్రభుత్వానికి ప్రతిపాదన పంపుతామని వివరించారు.
– తిరుపతి అర్బన్



స్మార్ట్ టికెట్!

రైలు వచ్చేస్తోంది.. అయ్యో ప్లాట్‌ఫామ్ మీద బయలుదేరేందుకు సిద్ధంగా ఉందే.. టికెట్ కౌంటర్ ముందు క్యూ ఏమో చాంతాడంత ఉంది. ఏం చేయాలి.. ట్రైన్ దొరుకుతుందో.. లేదో.. ఇలాంటి ఆందోళన ఇకపై ఉండదు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో టికెట్ తీసుకునేందుకు ఆధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చేసింది. ఎక్కడికక్కడ ఆటోమేటిక్ వెండింగ్ మిషన్లను రైల్వేశాఖ ఏర్పాటు చేసింది. ప్రత్యేక స్మార్ట్ కార్డును వినియోగించుకుని ప్రయాణికులే సులువుగా టికెట్ తీసుకునే అవకాశం కల్పించింది. ఈ వినూత్న విధానం ప్రతి ఒక్కరినీ విశేషంగా ఆకట్టుకుంటోంది.

- తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఆటోమేటిక్ వెండింగ్ మిషన్లు
- సులభతరంగా ప్రయాణికులకు టికెట్లు
- రూ.50 స్మార్ట్ కార్డుతో 3శాతం రాయితీ




తిరుపతి రైల్వేస్టేషన్‌లో వెండింగ్ మెషిన్ ద్వారా టికెట్ తీసుకుంటున్న ప్రయాణికులు

తిరుపతి అర్బన్ : ఆధునిక సమాజంలో అందరూ టెక్నాలజీ వైపు అడుగులు వేస్తున్నారు. సాంకేతిక అంశాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. పాత పద్ధతులనే పాటిస్తే అందరితోపాటు పరుగులు తీయడం సాధ్యం కాదని గుర్తిస్తున్నారు. ఒకప్పుడు రైల్లో ప్రయాణం చేయడానికి ముందుగా స్టేషన్‌లో టికెట్ కోసం గంటల కొద్దీ క్యూలో వేచి ఉండాల్సి వచ్చేది. ఈ క్రమంలో చిల్లర సమస్య తీవ్రంగా వేధించేది. టికెట్ తీసుకుని బయటకు వస్తే హమ్మయ్య అంటూ ఊపిరిపీల్చుకునేవారు. అయితే ఇప్పుడు అన్ని రైల్వే స్టేషన్లలో ఏటీఎం తరహాలో ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషిన్‌లు ఏర్పాటు చేశారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో 12 వరకు ఈ మిషన్లు అందుబాటులో ఉన్నాయి. రైల్వే స్టేషన్ టికెట్ కౌంటర్‌లో రూ.50 చెల్లిస్తే సరిపోతుంది ఏటీఎం కార్డు తరహాలో స్మార్ట్ కార్డును జారీ చేస్తారు. ఆ కార్డుకు మొబైల్ ఫోన్ మాదిరగా రీచార్జ్ చేసుకుంటే సరిపోతుంది. దేశంలో ఎక్కడకి వెళ్లినా రైల్వే స్టేషన్‌లోని ఆటోమేటిక్ వెండింగ్ మెషిన్ ద్వారా టికెట్‌ను సులభంగా పొందవచ్చు. స్మార్ట్‌కార్డుతో టికెట్ తీసుకుంటే ధరలో 3శాతం తగ్గింపు ఉంటుంది. ఈ క్రమంలో తిరుపతిలో ప్రయాణికులు ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషిన్‌పై ఆసక్తి చూపుతున్నారు. దీంతో సాదారణ టికెట్ కౌంటర్ల వద్ద రద్దీ దాదాపు తగ్గిపోయింది.

రద్దీ అధికం: తిరుపతి మీదుగా నిత్యం వందకు పైగా రైళ్లు నడుస్తున్నాయి. ఈ క్రమంలో ఇక్కడి నుంచి 85 వేల నుంచి 90 వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు.ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతి రైల్వే స్టేషన్‌కు దేశంలోని పలు ప్రాంతాల నుంచి ప్రయాణికులు వచ్చిపోతుంటారు. ఈ సందర్భంగా దాదాపు అన్ని రైళ్లలో రద్దీ అధికంగానే ఉంటుంది. ఈ క్రమంలో మిగిలిన వసతుల పరిస్థితి ఎలా ఉన్నా.. టికెట్ వెండింగ్ మిషన్ మాత్రం ప్రయాణికుల చక్కగా ఉపయోగపడుతోంది. సులువుగా టికెట్ తీసుకునే అవకాశం దక్కుతోంది.

ఫీ'జులుం'.. విచారణ అవసరం


మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కె.శివారెడ్డి

తిరుపతి కల్చరల్: మోహన్‌బాబు యూనివర్సిటీలో ఫీజుల దోపిడీపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి కె.శివారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంబీయూలో నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి ఫీజుల దోపిడీకి పాల్పడుతూ విద్యార్థులను దగా చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. తిరుపతి జిల్లా రంగంపేటలో ఉన్న మోహన్‌బాబు యూనివర్సిటీలో ప్రభుత్వం నిర్వహించిన ఎంసెట్ కౌన్సెలింగ్ ద్వారా ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరిన ప్రతి విద్యార్థి నుంచి ఏటా రూ.20 వేలు ఫీజును అధికంగా వసూలు చేస్తున్నారని విమర్శించారు. డే స్కాలర్స్‌గా కళాశాలకు వస్తున్న విద్యార్థులు కళాశాలకు సంబంధించిన మెస్‌లోనే భోజనం చేయాలని, దీనికి ప్రతి విద్యార్థి రూ.20 వేలు ఫీజు చెల్లించాలని యాజమాన్యం నోటీసులు ఇచ్చి బలవంతంగా వసూళ్లకు పాల్పడుతూ మోహన్‌బాబు నిజమైన కలెక్షన్ కింగ్‌గా నిరూపించుకున్నారన్నారు. పేదల విద్యార్థులకు మంచి విద్యను అందిస్తామని చెప్పిన మోహన్‌బాబు పేద విద్యార్థుల నుంచి రూ.లక్ష లు ఎందుకు వసూలు చేస్తున్నారో ఆయన సమాధానం చెప్పాలన్నారు. మోహన్‌బాబు వర్సిటీలో జరుగుతున్న ఫీజుల దోపిడీపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. కట్టిన ఫీజులకు రసీదులు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజు కాకుండా ఇతర ఫీజులు ఎందుకు కట్టాలని తల్లిదండ్రులు ప్రశ్నిస్తే కళాశాలలో బౌన్సర్లతో కొట్టించడం దుర్మార్గమని ఆరోపించారు. అంతేకాక ప్రొఫెసర్లతో చెప్పి ప్రశ్నించిన వారి పిల్లలను ఫెయిల్ చేయడం వంటి బ్లాక్ మెయిల్‌కు మోహన్‌బాబు పాల్పడుతున్నారని విమర్శించారు. కళాశాలలో చదువుతూ బయట హాస్టల్లో ఉన్న విద్యార్థుల నుంచి కూడా బలవంతపు ఫీజుల వసూళ్లకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. ఎంబీయూలో జరుగుతున్న అవకతవకలపై మంచు మనోజ్ ఇచ్చిన స్టేట్‌మెంట్‌ను సుమోటోగా స్వీకరించి తక్షణం విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి మోహన్‌బాబు యూనివర్సిటీని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కుమార్, శ్రీహరి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే 'సదస్సు'

చంద్రగిరి : సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శివరామసుబ్బయ్య తెలిపారు. మంగళవారం అగరాల, ఐతేపల్లెలో రెవెన్యూ సదస్సులు చేపట్టారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను సర్పంచ్ అగరాల భాస్కర్‌రెడ్డితో కలిసి స్వీకరించారు. ఏఓ విజయ్ భాస్కర్, ఉద్యానశాఖ అధికారి శైలజ పాల్గొన్నారు.

అర్జీదారులకు న్యాయం : తిరుపతి అర్బన్ తహసీల్దార్

తిరుపతి అర్బన్ : రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు సమర్పించేవారందరికీ న్యాయం చేస్తామని తహసీల్దార్ కేపీ భాగ్యలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అక్కారంపల్లె జెడ్పీ హైస్కూల్ వద్ద రెవెన్యూ సదస్సును నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కచ్చపి స్టేడియం ప్రాంతానికి చెందిన వారు సమస్యలు ఉంటే ఈ సదస్సులో దరఖాస్తులు ఇవ్వవచ్చునని స్పష్టం చేశారు. 17న కొంకచెన్నైయ్యగుంట ఆటోనగర్ గంగమ్మగుడి వద్ద, 23న తిమ్మినాయుడు పాళెంలోని తిరుమలరెడ్డినగర్ సచివాలయం, 26న మంగళం పరిధిలోని ధర్మరాజులగుడి, 28న చెన్నయ్యగుంట శ్రీరాములవారి ఆలయం, 30న శెట్టిపల్లి సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు.

13 నుంచి సంగీత విభావరి


మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

తిరుపతి కల్చరల్ : ఘంటసాల 102 జయంతిని పురస్కరించుకుని తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మహతి కళాక్షేత్రంలో 'మనసు పరిమళించినే' పేరుతో సంగీత విభావరి చేపడుతున్నట్లు సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు సంగీత విభావరి ప్రారంభమవుతుందని వెల్లడించారు. సమావేశంలో సొసైటీ అధ్యక్షుడు వైఎస్ బాబు, కోశాధికారి యు.ప్రసాద్‌రావు, ఉపాధ్యక్షులు ఎస్.సుబ్రమణ్యం, బుజ్జిబాబు నాయుడు, బండి మధుసూదన్‌రెడ్డి, అనసూయమ్మ, గుల్జార్, భాస్కర్, శాంతావాణి పాల్గొన్నారు.

రాజేశ్వరి సేవలు మరువలేం


విద్యార్థినికి నగదు బహుమతి అందిస్తున్న వైస్ ప్రిన్సిపల్

తిరుపతి సిటీ : పద్మావతి డిగ్రీ, పీజీ కళాశాలల విశ్రాంత ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజేశ్వరి మూర్తి సేవలు మరువలేమని ఎస్పీడబ్ల్యూ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ భద్రమణి కొనియాడారు. మంగళవారం రాజేశ్వరి 103వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి పేరిట ఉత్తమ విద్యార్థినులకు నగదు బహుమతులు అందజేశారు. కార్యాక్రమంలో విశ్రాంత హెచ్‌ఓడీ ప్రేమావతి, టీటీడీ పీఆర్‌ఓ నీలిమ, అధ్యాపకులు సి.భువనేశ్వరీదేవి, కె.వసుధ, మీనాకుమారి, ఏ.విద్యుల్లత, వెంకటలక్ష్మి, ఉమారాణి పాల్గొన్నారు.

ఘనంగా మానవ హక్కుల దినోత్సవం




మాట్లాడుతున్న ప్రొఫెసర్ శ్రీధర్, ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ : జిల్లా పౌర చైతన్య వేదిక, అంబేడ్కర్ లా కాలేజీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం నిర్వహించారు. ప్రొఫెసర్ కుంచె శ్రీధర్ మాట్లాడుతూ మానవ హక్కుల ఉల్లంఘనపై ప్రతి ఒక్కరూ గళమెత్తాలని పిలుపునిచ్చారు. లా కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ బిజయ్ కుమార్ బెహెరె, చైతన్య వేదిక జిల్లా అధ్యక్షుడు వాకా ప్రసాద్, గౌర వాధ్యక్షుడు రాఘవ, కార్యదర్శి ఏఎన్ పరమేశ్వర రావు, సాకం నాగరాజు పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో..

పద్మావతి మహిళా వర్సిటీలో మానవహక్కులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. లీగల్ సపోర్ట్ సెల్ కన్వీనర్ ప్రొఫెసర్ అనురాధ మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. డాక్టర్ సునీత కానిపాకం, డాక్టర్ ఇందిరా ప్రియదర్శిని పాల్గొన్నారు.

అవగాహన అవసరం

తిరుపతి అర్బన్ : మానవహక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని తుడా కార్యదర్శి వెంకటనారాయణ, ఆర్పీఎఫ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తెలిపారు. మంగళవారం కరకంబాడి మార్గంలోని ఎస్‌వీసీ ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. వే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పైడి అంకయ్య, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.సుధాకర్ రెడ్డి, హెచ్‌ఓడీ డాక్టర్ ఎం.నీరజ, కో–ఆర్డినేటర్ డాక్టర్ టి. శిరీష పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై దాడి

తిరుపతి క్రైం: నగరంలోని జైశ్యామ్ థియేటర్ సమీపంలోని ఓ లాడ్జిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో ఈస్ట్ పోలీసులు మెరుపు దాడులు చేసి, ముగ్గురిని అరెస్టు చేసిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. ఈస్ట్ సీఐ రామకృష్ణ కథనం మేరకు.. పీజీఆర్ రెసిడెన్సీలో రూమ్ నంబర్ 106లో వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం వచ్చింది. గురవయ్య అనే వ్యక్తి లాడ్జిని లీజుకు తీసుకుని ఎవరికీ అనుమానం రాకుండా వ్యభిచారం చేయించేవాడు. దీనిపై అందిన రహస్య సమాచారం మేరకు దాడులు నిర్వహించగా గురవయ్యతోపాటు కోదూరు గోవర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర్లును అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ. వెయ్యి నగదును కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఓ విటురాలిని గుర్తించి ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించామన్నారు.

సైకాలజికల్ థ్రిల్లర్‌గా 'ఫెయిర్'


మాట్లాడుతున్న హీరోయిన్ నివేదిత

తిరుపతి కల్చరల్ : సైకాలజికల్ ఫ్యామిలీ థ్రిల్లర్‌గా 'ఫెయిర్' సినిమా ఉంటుందని దర్శకులు గోగినేని హరిత తెలిపారు. ఈ నెల 14న చిత్రం విడుదల సందర్భంగా తిరుమల శ్రీవారి దర్శనానికి విచ్చేసిన యూనిట్ మంగళవారం తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్లో మీడియాతో మాట్లాడారు. శ్రీవారి పాదాల చెంత నుంచే సినిమా ప్రమోషన్‌కు శ్రీకారం చుట్టామన్నారు. ఈ చిత్రానికి ఇప్పటికే జాతీయ స్థాయి అవార్డులు దక్కాయని వెల్లడించారు. హీరోయిన్ నివేదిత మాట్లాడుతూ మంచి కంటెంట్‌తో రూపొందిన ఈ చిత్రంలో నటించే అవకాశం రావడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో నిర్మాత ఏఆర్ అభి, నటులు సాహితీ దాసరి, శానిసాల్మన్ పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లో రాణించాలి


విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి షేక్ సయ్యద్ సాహెబ్

తిరుపతి కల్చరల్: శారీరక, మానసిక ఆరోగ్య అభివృద్ధికి క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని, విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని జిల్లా స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి షేక్ సయ్యద్ సాహెబ్ తెలిపారు. తుమ్మలగుంట కేవీఎస్ గ్రౌండ్‌లో మంగళవారం జరిగిన భాష్యం ప్రీమియర్ లీగ్–2024 జోనల్ క్రికెట్ క్వార్టర్, సెమీఫైనల్స్ పోటీలు మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో మదనపల్లి భాష్యం విద్యార్థుల జట్టు విన్నర్‌గా నిలవగా, రన్నర్‌గా తిరుపతి భాష్యం విద్యార్థుల జట్టు నిలిచింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మనలో ఐక్యతను పెంచుతాయన్నారు. భాష్యం విద్యాసంస్థలు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత కల్పించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ లక్ష్మణ్, జోనల్ ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి మెట్రో సర్వీస్‌లో కిటికీలోని లగేజీ వేస్తున్న హమాలీలు, చోద్యం చూస్తున్న కండక్టర్





లగేజీ..గజిబిజీ!


సీట్లపై వేసిన లగేజీలు

తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నిత్యం రద్దీగా ఉంటుంది. ఇక శ్రీకాళహస్తి ప్లాట్‌ఫామ్ వద్ద కిక్కిరిసి ఉంటుంది. బస్సు ఆగగానే నిముషాల్లో నిండిపోతుంది. అందులోనూ మెట్రో సర్వీసులకు ప్రయాణికులు అధిక ప్రాధాన్యమిస్తుంటారు. ఇందులో సీట్లు విశాలంగా ఉండడంతో జర్నీ చేసేందుకు ఇష్టపడుతుంటారు. అయితే మంగళవారం ఉదయం ముక్కంటి సన్నిధికి బయలు దేరే మెట్రో సర్వీసులో ప్రయాణికులను కాదని సీట్లపై లగేజీని పెట్టేశారు. చేసేది లేక కండక్టర్ సైతం చోద్యం చూస్తూ ఉండిపోయారు. ఇదేంటని ప్యాసింజర్లు ప్రశ్నించినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. అధికారుల పర్యవేక్షణ లోపంతోనే కార్గో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బస్టాండ్ ఆవరణను సైతం లగేజీ సెంటర్‌గా మార్చేశారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.
– తిరుపతి అర్బన్




తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ఆవరణలో ఎక్కడ పడితే అక్కడ వేసిన కార్గో పార్శిళ్లు

మానవహక్కుల పాత్ర కీలకం


మాట్లాడుతున్న ఎస్వీయూ వీసీ అప్పారావు

తిరుపతి సిటీ: సమ సమాజ స్థాపనలో మానవ హక్కులు కీలక పాత్ర పోషిస్తాయని, వీటిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి గౌరవించాలని ఎస్వీయూ ఉపకులపతి సీహెచ్ అప్పారావు అన్నారు. మంగళవారం ఎస్వీయూలో 76వ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీసీ మాట్లాడారు. ప్రతి ఒక్కరికీ పుట్టుకతో సంక్రమించిన హక్కులను, రాజ్యాంగపరంగా లభించిన హక్కులను హరించే అధికారం ఎవరికీ లేదన్నారు. అయితే దురదృష్టవశాత్తు హక్కులకు ఉల్లంఘన కలుగుతుండటం ఆవేదన కలిగించే అంశమన్నారు. అనంతరం పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో డీన్ బీవీ మురళీధర్, ప్రిన్సిపల్ సుధారాణి, వివేక్, రంజిత్ కుమార్, రవిబాబు, వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో...

ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన మానవహక్కుల దినోత్సవంలో ప్రిన్సిపల్ సత్యనారాయణ మాట్లాడారు. విద్యార్థులు మానహక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సెట్విన్ అధికారి మోహన్ పాల్గొన్నారు.

బీసీలకు మళ్లీ వెన్నుపోటు


టి.పుల్లయ్య

తిరుపతి మంగళం : బీసీలకు ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ వెన్నుపోటు పొడిచారని, డబ్బున్న వారికే రాజ్యసభ సీట్లు కట్టబెట్టారని వైఎస్సార్‌సీపీ నాయీబ్రాహ్మణ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తొండమల్ల పుల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ గతంలో సామాన్యులనే జగనన్న రాజ్యసభకు పంపించారని, ఇప్పుడు చంద్రబాబు మాత్రం ధనవంతులకే అవకాశం కల్పించారని విమర్శించారు. ఎన్నికల సమయంలో బీసీలను ఓట్ల కోసమే చంద్రబాబు వాడుకుంటుందని, తర్వాత అసలు నైజం బయటపెడతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీకు ఏనాడూ మేలు చేకూర్చలేదని ఆరోపించారు. బీసీ నాయకుడినంటూ చెప్పుకునే ఆర్.కృష్ణయ్య తన స్వలాభం కోసమే పార్టీలు మారుతున్నారని విమర్శించారు. క్రిమినల్ కేసుల్లో ఉన్న సానా సతీష్‌కి రాజ్యసభ సీటు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.